


ఉష్ణోగ్రత: గరిష్ఠం 39.9 కనిష్ఠం 18.5

రంజాన్ వేళలు
ఇఫ్తార్: 6:33 (గురువారం సాయంత్రం)
సహార్: 4:58 (శుక్రవారం ఉదయం)

డిప్యూటీ సీఎం, ఆర్థిక శాఖ మంత్రి భట్టివిక్రమార్క, బుధవారం అసెంబ్లీలో ప్రవేశపెట్టిన రాష్ట్ర బడ్జెట్‌లో ఉమ్మడి రంగారెడ్డి జిల్లాకు కేటాయింపులు అంతంత మాత్రంగానే ఉన్నాయి. రంగారెడ్డి జిల్లాలో ఏర్పాటుచేయనున్న ఫ్యూచర్‌సిటీపైనే ప్రభుత్వం ఎక్కువగా ఫోకస్ పెట్టింది. బడ్జెట్ ప్రసంగంలో భట్టి అధికంగా ఫ్యూచర్‌సిటీ గురించే ప్రస్తావించారు. పాలమూరు- రంగారెడ్డి ఎత్తిపోతల పథకం, లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ నిర్మాణానికి అరకొర నిధుల కేటాయింపు జరిగింది. ఇక సీఎం రేవంత్‌రెడ్డి, అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ ప్రాతినిధ్యం వహిస్తున్న వికారాబాద్ జిల్లాకు ఈ బడ్జెట్ తీవ్ర నిరాశను మిగిల్చింది. తెలంగాణ ఊటీగా పేరొందిన అనంతగిరి కొండలను పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతామని అనేక సార్లు ప్రకటించినా ప్రత్యేక నిధులేమీ కేటాయించలేదు. మేడ్చల్ జిల్లాలో 10 వేల ఎకరాల్లో రూ.450 కోట్లతో ఉద్యాన పంటల హబ్ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చినప్పటికీ ఈ బడ్జెట్‌లో ఆ ప్రస్తావనే లేదు



- పాలమూరు- రంగారెడ్డి ఎత్తిపోతలకు అరకొర నిధులే
- లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ పనులపై మాత్రమే హామీ
- మెట్రో విస్తరణకు అత్తెసరు నిధుల కేటాయింపు
- రంగారెడ్డి జిల్లా మామిడిపల్లిలో పశుటీకాల రీసెర్చ్ కేంద్రం
- కొహెడలో చేపల మార్కెట్ ఏర్పాటుకు ఓకే
- శంకర్‌పల్లిలో 250మెగావాట్ల బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్ సిస్టమ్



ఫ్యూచర్ సిటీపైనే ఫోకస్!

బడ్జెట్ 2025-26

ఉమ్మడి జిల్లాకు కేటాయింపులు అంతంతే!

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డిజిల్లా ప్రతినిధి) : రాష్ట్ర పభుత్వం అసెంబ్లీలో బుధవారం ప్రవేశపెట్టిన బడ్జెట్ ఉమ్మడి జిల్లావాసులను కొంత నిరాశకు గురిచేసింది. ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న పాలమూరు - రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి ఈ బడ్జెట్‌లో భారీగా కేటాయింపులు ఉంటాయని అందరూ భావించారు. కానీ, ప్రభుత్వం ఈ ఏడాది బడ్జెట్‌లో రూ.1736 కోట్లు మాత్రమే కేటాయించింది. ఈ ప్రాజెక్టులో భాగమైన రిజర్వాయర్‌ను మాత్రమే ప్రస్తావించింది. జైపాల్‌రెడ్డి పాలమూరు- రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో భాగంగా కేపీ లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ నిర్మాణానికి సత్వర చర్యలు తీసుకుంటామని ఆర్థిక శాఖ మంత్రి భట్టి విక్రమార్క బడ్జెట్ ప్రసంగంలో తెలిపారు. కేటాయించిన బడ్జెట్‌లో రిజర్వాయర్ నిర్మాణానికి ఎంత ఖర్చు చేస్తారు?.. ఇప్పటికే మహబూబ్‌నగర్ జిల్లా ప్రాంతంలో కొనసాగుతున్న పనులకు కేటాయింపులు ఎంత?.. కొత్తగా ఉమ్మడి జిల్లాలో ఏమైనా పనులు

మిగతా 7వ పేజీలో...

అరచేతిలో వైకుంఠమే..



బడ్జెట్‌ను చూస్తే అరచేతిలో వైకుంఠం చూపించే విధంగా ఉంది. ప్రచారం చేసుకునేందుకే ఈ బడ్జెట్ ప్రవేశ పెట్టినట్లు ఉంది. హామీలకు, నిధుల కేటాయింపులకు పొంతన లేదు. ఆరు గ్యారెంటీల అమలుపై స్పష్టత కొరవడింది. రైతులకు, వ్యవసాయ కూలీలకు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల సంక్షేమానికి నిధుల కోత పెట్టారు. ఆర్టీసీ పరిరక్షణకు కేటాయింపులు లేవు.

- ఆర్.మహిపాల్, సీపీఎం జిల్లా కార్యదర్శి, వికారాబాద్

రూ. 10లక్షలు దాటేసింది!

తలసరి ఆదాయంలో 'రంగారెడ్డి' సరికొత్త రికార్డు
అగ్రస్థానంలో రంగారెడ్డి, చిట్టచివరి స్థానంలో వికారాబాద్

దేశంలోనే అత్యధిక తలసరి ఆదాయం గల జిల్లాగా కొనసాగుతున్న రంగారెడ్డి జిల్లా మరో సరికొత్త రికార్డు సృష్టించింది. ప్రభుత్వం బుధవారం అసెంబ్లీలో విడుదల చేసిన సామాజిక ఆర్థిక సర్వే నివేదిక ప్రకారం రంగారెడ్డి జిల్లా రూ.10,55,913 తలసరి ఆదాయంతో అగ్రస్థానంలో నిలిచింది. దేశంలో తొలిసారిగా తలసరి ఆదాయంలో రూ.10లక్షల మార్క్ దాటిన జిల్లాగా రికార్డుల్లోకి ఎక్కింది. దేశంలో రెండు, మూడు స్థానాల్లో ఉన్న హర్యానా రాష్ట్రంలో గుర్‌గావ్ జిల్లా, కర్నాటక రాష్ట్రంలోని బెంగుళూరు అర్బన్ జిల్లాలో తలసరి ఆదాయంలో రూ.9లక్షలకు చేరువలో ఉన్నాయి. ఇదిలా ఉంటే ప్రభుత్వం విడుదల చేసిన సామాజిక ఆర్థిక సర్వే నివేదిక ప్రకారం రంగారెడ్డిజిల్లా అగ్రస్థానంలో ఉండగా, పక్కనే ఉన్న వికారాబాద్ జిల్లా రూ.1,98,401 తలసరి ఆదాయంతో చిట్టచివరి స్థానంలో ఉండడం గమనార్హం. రంగారెడ్డి జిల్లా తరువాత రెండో స్థానంలో హైదరాబాద్(రూ.5,54,105), మూడో స్థానంలో సంగారెడ్డి(రూ.3,45,478) ఉండగా మేడ్చల్ మల్కాజ్‌గిరి(రూ.3,43,130) నాలుగో స్థానంలో నిలిచింది.



జిల్లా అధ్యక్షుడిని మార్చండి

- బీజేపీ రాష్ట్ర కార్యాలయానికి జిల్లా పంచాయితీ
- రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీకి స్థానిక నేతల ఫిర్యాదు



రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీకి ఫిర్యాదు చేస్తున్న బీజేపీ జిల్లా నాయకులు

వికారాబాద్, మార్చి19(ఆంధ్రజ్యోతి): జిల్లా బీజేపీ పంచాయితీ రాష్ట్ర కార్యాలయానికి చేరుకుంది. బుధవారం జిల్లా నుంచి పెద్ద సంఖ్యలో నాయకులు హైదరాబాద్‌లోని రాష్ట్ర పార్టీ కార్యాలయానికి చేరుకుని జిల్లా అధ్యక్షుడిగా రాజశేఖర్‌రెడ్డి నియామకాన్ని నిరసిస్తూ ఆందోళన చేపట్టారు. అనంతరం కార్యాలయంలో బీజేపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీని కలిసి సమస్యను విన్నవించారు. వెంటనే జిల్లా అధ్యక్షుడిని మార్చాలని డిమాండ్ చేశారు. సీనియర్లను కాదని, మూడు నెలల క్రితం పార్టీలోకి వచ్చిన వ్యక్తికి అధ్యక్ష పదవి ఇవ్వడం ఏమిటని మండిపడ్డారు. అలాగే ఆయన స్థానికుడు కాదని ఆయనతో కలిసి పనిచేసేందుకు సిద్ధంగా లేమని స్థానిక నేతలు స్పష్టం చేశారు. ఈ విషయంపై పార్టీ త్వరగా తీసుకోక పోతే అన్ని కార్యక్రమాలకు దూరంగా ఉంటామని హెచ్చరించారు. హైదరాబాద్‌కు వెళ్లిన వారిలో మాధవరెడ్డి, శివరాజ్, సదానందారెడ్డి, విజయభాస్కర్‌రెడ్డి, సతీశ్, రాజేందర్ రెడ్డి, బుస్సా శ్రీకాంత్, వివేకానందరెడ్డి, నరోత్తంరెడ్డి, పాండు తదితరులు ఉన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న లింగ్యానాయక్

అర్హులందరూ ఓటరుగా నమోదు చేసుకోవాలి

- అదనపు కలెక్టర్ లింగ్యానాయక్

వికారాబాద్, మార్చి19(ఆంధ్రజ్యోతి): 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ సూచించారు. బుధవారం కలెక్టరేట్‌లో రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఓటరు నమోదు, మార్పులు- చేర్పులు, బూత్‌స్థాయి ఏజెంట్ల నియామకం, అభ్యర్థుల ఖర్చులు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటరు నమోదు నిరంతర ప్రక్రియ అని తెలిపారు. ఫారం 7 ద్వారా మార్పులు చేర్పులు చేసుకోవచ్చన్నారు. బూత్ స్థాయి ఏజెంట్ల నియామకం వారం రోజుల్లోగా చేపట్టే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. జాబితాలను పోలింగ్ కేంద్రం వారిగా బీఎల్‌ఏల మొబైల్ నంబర్‌తో సహ తహసీల్దార్లకు లేదా ఎన్నికల రిటర్నింగ్ అధికారికి జిల్లా పార్టీల అధ్యక్షులు సంతకాలతో సమర్పించాలని తెలిపారు. సమావేశంలో ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ నైమత్ అలీ, డిప్యూటీ తహసీల్దార్ ఉష్యా నాయక్, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఆస్తి పన్ను లక్ష్యాన్ని చేరుకోవాల్సిందే

- విధుల పట్ల నిర్లక్ష్యం వహించొద్దు
- స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ సుధీర్



యజమానికి ఆస్తి పన్ను రశీదును అందజేస్తున్న అదనపు కలెక్టర్ సుధీర్

తాండూరు, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): ఆస్తి పన్నును నిర్ణయించిన లక్ష్యాల మేరకు వసూలు చేయాలని ఈ విషయంలో నిర్లక్ష్యం చేయొద్దని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ సుధీర్ మున్సిపల్ అధికారులకు సూచించారు. ఆయన బుధవారం తాండూరు మున్సిపాలిటీ మల్‌రెడ్డిపల్లి ప్రాంతంలో ఆస్తి పన్ను వసూళ్ల ప్రక్రియను పరిశీలించారు. అనంతరం మున్సిపల్ కార్యాలయంలో వార్డు ఆఫీసర్లు, బిల్ కలెక్టర్లు, సిబ్బంది, అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా విధుల పట్ల నిర్లక్ష్యం వహించొద్దని వారిని హెచ్చరించారు. ఎల్‌ఆర్‌ఎస్ విషయంలో దరఖాస్తుదారులతో మాట్లాడి ఎప్పటికప్పుడు ఫీజు చెల్లించాలన్నారు. వార్డు ఆఫీసర్లు ఆయా వార్డుల్లో మంచినీరు, పారిశుధ్య, వీధి దీపాల నిర్వహణను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలన్నారు. తాండూరు మున్సిపాలిటీ ఆస్తి పన్ను వసూళ్లలో వెనుకంజలో ఉండటంపై ఆయన ఆర్‌ఐలను ప్రశ్నించారు. అంతకుముందు ఆస్తి పన్ను వసూలు చేస్తున్న ప్రాంతాల్లో ప్రజలతో మాట్లాడారు. సమావేశంలో కమిషనర్ విక్రమసింహారెడ్డి, మేనేజర్ నరేందర్‌రెడ్డి, ఆర్‌ఐ అశోక్, తదితరులు ఉన్నారు.

ముగిసిన ఫస్టియర్ పరీక్షలు

- చివరి రోజు 260 మంది గైర్హాజరు

వికారాబాద్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఇంటర్ ఫస్టియర్ పరీక్షలు బుధవారం జరిగిన చివరి పరీక్షతో ముగిశాయి. ఈ పరీక్షల్లో ఇంత వరకు జిల్లాలో ఒక్క మాల్ ప్రాక్టీస్ కేసు కూడా నమోదు కాలేదు. కాగా, సెకెండియర్ పరీక్షలు నేటి(గురువారం)తో ముగియనున్నాయి. బుధవారం నిర్వహించిన మొదటి సంవత్సరం కెమిస్ట్రీ, కామర్స్, ఒకేషనల్ పరీక్షలకు మొత్తం 260 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. 8,413 మందికి గాను 8,153 మంది హాజరయ్యారు. జనరల్ విభాగంలో 7,055 మంది విద్యార్థులకు 6,856 మంది హాజరు కాగా, 199 మంది గైర్హాజరయ్యారు. ఒకేషనల్ విభాగంలో 1,358 మంది విద్యార్థులకు 1,297 మంది హాజరు కాగా, 61 మంది గైర్హాజరయ్యారు.

విద్యార్థులు 15,930.. సెంటర్లు 69



- రేపటి నుంచి ఎగ్జామ్స్ ప్రారంభం
- సీసీ కెమెరాల నిఘాలో నిర్వహణ
- ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం
- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు

పది పరీక్షలకు సర్వం సిద్ధం!

పదో తరగతి పరీక్షలు పకడ్బందీగా నిర్వహించేందుకు జిల్లా విద్యా శాఖ అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. రేపటి(21వ తేదీ) నుంచి ప్రారంభమయ్యే పరీక్షలు ఏప్రిల్ 4 వరకు కొనసాగనున్నాయి. జిల్లాలో రెగ్యులర్ విద్యార్థులు 12,903 మంది హాజరుకానున్నారు. అలాగే ఒకసారి ఫెయిలైన 3,027 మంది పరీక్ష రాసేందుకు దరఖాస్తు చేసుకున్నారు. మొత్తం 69 సెంటర్లు ఏర్పాటు చేశారు. సీసీ కెమెరాల నిఘాలో పరీక్షలు కొనసాగనున్నాయి.

బాలురు	6,450
బాలికలు	6,453
ఫెయిల్ అయినవారు	3,027



బొంరాస్‌పేటలో హాల్‌టికెట్లు చూపుతున్న విద్యార్థులు

అధికారుల వివరాలు:	
సీ-కేటగిరీ సెంటర్లు	03
చీఫ్ సూపరింటెండెంట్లు	69
డిపార్ట్‌మెంటల్ అధికారులు	69
పీఎస్ కస్టోడియన్లు	04
జాయింట్ కస్టోడియన్లు	04
ఇన్విజిలేటర్లు	720
సిట్టింగ్ స్క్వాడ్స్	69
ఫ్లయింగ్ స్క్వాడ్స్	05

వికారాబాద్, మార్చి 19(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): పరీక్షల్లో మాల్ ప్రాక్టీసింగ్ జరగకుండా ప్రతీ కేంద్రంలో ఒకరిని సిటింగ్ స్క్వాడ్‌గా నియమించారు. అంతే కాకుండా ఆకస్మిక తనిఖీలు నిర్వహించేందుకు అయిదు ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలను కూడా నియమించారు. ప్రతీ పరీక్ష కేంద్రంలో సీసీ కెమెరాలు అమర్చేలా చర్యలు తీసుకున్నారు. పోలీసు స్టేషన్‌కు దూరంగా ఉండే సీ- సెంటర్ల నుంచి ప్రశ్న పత్రాలను పోలీసు భద్రత మధ్య తరలించేందుకు ప్రత్యేక వాహనాలు ఏర్పాటు చేయనున్నారు. పరీక్ష కేంద్రంలోకి సెల్‌ఫోన్లు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలను తీసుకు రాకుండా నిషేధం విధించారు. విద్యార్థులు అస్వస్థతకు గురైతే ప్రథమ చికిత్స అందించేందుకు అవసరమైన మందులతో ఏఎన్‌ఎంలు సిద్ధంగా ఉండేలా చర్యలు చేపట్టారు. ఎప్పటి మాదిరిగానే పరీక్ష కేంద్రాల వద్ద నిషేధాజ్ఞలు అమలు చేయనున్నారు. పరీక్ష కొనసాగే సమయంలో కేంద్రాల సమీపంలో

మిగతా 8వ పేజీలో...

బీసీలకు 50శాతం కోటా ఇవ్వాలి

మహిళలకు సబ్‌కోటా కేటాయించాలి
బీసీ కార్యవర్గ జాతీయ సభ్యుడు రాజ్‌కుమార్ డిమాండ్

7

వ్యక్తి అనుమానాస్పద మృతి

కన్నతల్లి, కట్టుకున్న భార్యపైనే అనుమానం
విచారణ చేస్తున్న పెద్దేముల్ పోలీసులు

6

మా సమస్యలు పరిష్కరించండి

- కలెక్టరేట్ ముట్టడికి ఆశావర్కర్ల యత్నం.. అరెస్టు



శామీర్‌పేట పోలీస్‌స్టేషన్‌లో ఆశావర్కర్లు

మేడ్చల్ ప్రతినిధి, మార్చి19(ఆంధ్రజ్యోతి): తమ సమస్యల పరిష్కారించాలని కోరుతూ బుధవారం ఆశావర్కర్స్ యూనియన్ సీఐటీయూ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ముట్టడి యత్నించారు. దీంతో కలెక్టరేట్‌కు వెళ్లే దారిలో స్టాపర్లు ఏర్పాటు చేసి కలెక్టర్ కార్యాలయం వైపు వెళ్లకుండా అడ్డుకున్నారు. పలువురుని అదుపులోకి తీసుకుని శామీర్‌పేట, అల్వాల్, దుండిగల్ తదితర పోలీస్‌స్టేషన్లకు తరలించారు. ఈ సందర్భంగా ఆశావర్కర్లు కలెక్టరేట్‌కు వెళ్లే దారిలో బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు అశోక్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఆశా వర్కర్లకు రూ.18 వేలు వేతనం ఇస్తామని చెప్పి మోసం చేసిందన్నారు. పీఎఫ్, ఈఎస్ఐ, రిటైర్మెంట్ బెనిఫిట్స్ కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఉన్నికృష్ణన్, కిష్టప్ప, లింగస్వామి, రాజశేఖర్ పాల్గొన్నారు.

మండుటెండల్లో మంచుదుప్పటి



ఘట్‌కేసర్‌లోని బైపాస్ రోడ్డులో..



ఎదులాబాద్ రోడ్డులో..

ఎండలతో జనాలు ఉక్కిరిబిక్కిరి అవుతుంటే.. వేకువజామున పొగమంచు ఇబ్బంది పెడుతోంది. ఘట్‌కేసర్ మున్సిపాలిటీ పరిధిలో బుధవారం ఎక్కడ చూసినా మంచుతెరలే దర్శనమిచ్చాయి. దీంతో రోడ్లపై రాకపోకలకు వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. దాదాపు గంటన్నరపాటు కురిసిన మంచు తుంపరులతో ద్విచక్ర వాహనదారులు, పాదచారులు తడిసిపోయారు.

-ఘట్‌కేసర్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి):

పౌష్టికాహారం అందించాలి

రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్‌రెడ్డి



భోజనాన్ని పరిశీలిస్తున్న శ్రీనివాస్‌రెడ్డి

కడ్తాల్, మార్చి 19(ఆంధ్రజ్యోతి): ఆహార భద్రత విషయంలో అలసత్వానికి తావుండకూడదని రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి అధికారులకు ఆదేశించారు. పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, ఆశ్రమ పాఠశాలలు, కేజీబీవీలలో విద్యార్థులకు నాణ్యమైన పౌష్టికాహారం విధిగా అందించాలని సూచించారు. మండల కేంద్రంలో బుధవారం విస్తృతంగా పర్యటించారు. ఫుడ్ కమిషన్ సభ్యులు ఓరుగంటి ఆనంద్, గోవర్ధన్‌రెడ్డి, బూక్య జ్యోతితో కలిసి 3వ నెంబర్ రేషన్ దుకాణం, శివాలయం సమీపంలోని ప్రాథమికోన్నత పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రం, కేజీబీవీ, గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాలను తనిఖీ చేశారు. రేషన్ దుకాణం రికార్డులను పరిశీలించారు. అంత్యోదయ కార్డుల వినియోగదారులకు ప్రతినెల చక్కెర ఇవ్వకపోవడం పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం శివాలయం సమీపంలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేసి తక్కువ సైజు ఉన్న గుడ్లను చూసి చైర్మన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాలను తనిఖీ చేశారు. ఆహారం అందుతున్న తీరుపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అక్కడి నుండి కేజీబీవీకి చేరుకుని రికార్డులు, పరిసరాలు పరిశీలించి విద్యార్థుల సమస్యలు అడిగి తెలుసుకుని పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. ఆర్డీవోజగదీశ్వర్‌రెడ్డి, డీడబ్ల్యూవో సంధ్య, ఏపీడీలు నరేందర్‌రెడ్డి, చరణ్, నవీన్‌రెడ్డి, సీడీపీవో శాంతిరేఖ, తహసీల్దార్ ముంతాజ్, ఎంపీడీవో సుజాత, డీటీలు రవిందర్‌నాయక్, భానుప్రకాష్ పాల్గొన్నారు.

హన్మాపూర్‌లో వ్యక్తి అనుమానాస్పద మృతి

-కన్నతల్లి, కట్టుకున్న భార్యపైనే అనుమానం.. కేసు నమోదు



వెంకటేశ్(ఫైల్)

పెద్దేముల్, మార్చి19(ఆంధ్రజ్యోతి): ఓ వ్యక్తి రక్తపు మడుగలో పడి అనుమానాస్పదంగా మృతి చెందాడు. కాగా, అతని మృతిపై కన్నతల్లి, కట్టుకున్న భార్యనే అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పెద్దేముల్ మండలం హన్మాపూర్ గ్రామానికి చెందిన బక్కని వెంకటేశ్(33)కు అదే గ్రామానికి చెందిన సబితతో 14ఏళ్ల క్రితం వివాహం జరిగింది. వారికి ఇద్దరు పిల్లలు. పెళ్లి జరిగిన నాలుగైదు సంవత్సరాల నుంచి వెంకటేశ్ మద్యానికి బానిసయ్యాడు. నిత్యం మద్యం తాగొచ్చి కుటుంబ సభ్యులను వేధిస్తుండేవాడు. పెద్దమనుషుల మధ్యన కూర్చోబెట్టి అతడి ప్రవర్తన మార్చుకోవాలని చెప్పించారు. అయినా అతనిలో మార్పురాలేదు. ఒకసారి భర్త వేధింపులు భరించలేక భార్య సబిత చితకబాదింది. ఆ తర్వాత అత్తాకోడలు ఇద్దరూ ఇల్లు విడిచి బతుకుదెరువుకు హైదరాబాద్ వెళ్లారు. కొన్ని నెలలు అక్కడే ఉన్న వారు రెండునెలల క్రితం తిరిగి ఊరికి వచ్చారు. వారు వచ్చినప్పటి నుంచి మళ్లీ వెంకటేశ్ ఎప్పటిలాగే తాగివచ్చి వారిని ఇబ్బంది పెడుతున్నాడు. ఏమైందో తెలియదు మంగళవారం రాత్రి తన ఇంటి ఆవరణలోనే హత్యకు గురయ్యాడు. బుధవారం తెల్లవారుజామున అతడి తల్లి లక్ష్మమ్మ, కోడలు సబితతో కలిసి పొరుగున ఉంటున్న తనచిన్న కుమారుడు బక్కని శ్రీనివాస్‌వద్దకు వెళ్లి, వెంకటేశ్‌ను ఎవరో కొట్టిచంపారని చెప్పింది. దీంతో ఇంటికి వచ్చి చూసే సమయంలో రక్తపు మడుగులో ఉన్న తన అన్న మృతదేహాన్ని చూసి తల్లి, వదినలపై అనుమానం ఉందని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో తాండూరు డీఎస్పీ బాలకృష్ణారెడ్డి, రూరల్ సీఐ నగేశ్, ఎస్ఐ.శ్రీధర్‌రెడ్డి సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకుని విచారణ నిర్వహించారు. క్లూస్‌టీంతో వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు. అనుమానితులుగా ఉన్న తల్లి లక్ష్మమ్మ, భార్య సబితలను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు తెలుస్తోంది.

భారీగా కారుణ్య నియామకాలు

వికారాబాద్, మార్చి19 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖలో భారీసంఖ్యలో కారుణ్య నియామకాలులు చేపడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి సీతక్క, పీఆర్ ప్రిన్సిపల్‌సెక్రటరీ లోకేష్‌కుమార్, పంచాయతీరాజ్ డైరెక్టర్ సృజనలకు టీపీఆర్ఎంటీఏ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సత్యనారాయణరెడ్డి, ఆకుల నందకుమార్ ధన్యవాదాలు తెలిపారు. విధి నిర్వహణలో మృతి చెందిన పీఆర్ఆర్‌డీ ఉద్యోగులు, జడ్పీ, మండల పరిషత్తు ఉపాధ్యాయుల వారసులను జూనియర్ అసిస్టెంట్ పోస్టుల్లోనియమించేందుకు తెలంగాణ రాష్ట్ర చరిత్రలో తొలిసారిగా పోస్టుల అప్‌గ్రేడేషన్, సూపర్ న్యూమరీ పోస్టులు సృష్టించి ఒకేసారి 582 మందికి నియామక పత్రాలు అందజేయడం అభినందనీయమన్నారు.

పేద ఖైదీలకు ఉచితంగా న్యాయసేవలు

» లీగల్ సర్వీస్ అథారిటీ జిల్లా కార్యదర్శి, జడ్జి డీబీ శీతల్

పరిగి, మార్చి19(ఆంధ్రజ్యోతి): జైలులో మగ్గుతున్న పేద ఖైదీలకు ఉచితంగా న్యాయ సేవలు అందిస్తామని లీగల్ సర్వీస్ అథారిటీ జిల్లా కార్యదర్శి, జడ్జి డీబీ శీతల్ అన్నారు. బుధవారం ఆమె పరిగి సబ్ జైలును సందర్శించారు. ఈ సందర్భంగా పలువురు ఖైదీలతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. అలాగే జైలులో వసతులు, భోజనం గురించి ఆరా తీశారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ పేద ఖైదీలకు ఉచితంగా న్యాయ సేవలందించేందుకు ప్రత్యేకంగా న్యాయవాదులు ఉంటారని తెలిపారు. కార్యక్రమంలో జైలు సూపరింటెండెంట్ రాజ్‌కుమార్, గౌస్‌పాషా, వెంకటేశ్, శ్రీనివాస్, మోహన్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఆమె పరిగి బాలసదనాన్ని సందర్శించారు.

(ఐదో పేజీ తరువాయి)

ఫ్యూచర్ సిటీపైనే ఫోకస్!

చేపడతారా? అనే దానిపై స్పష్టత ఇవ్వలేదు. దీంతో ఈ ఏడాది ఈ రిజర్వాయర్ పనుల వరకే ప్రభుత్వం పరిమితమైనట్లు కనిపిస్తోంది. ఉమ్మడి రంగారెడ్డిజిల్లాలో 2.7లక్షల ఎకరాలకు సాగు నీరందించే ప్రాజెక్టు పనులు ఈ ఏడాది కూడా పెద్దగా ముందుకు వెళ్లే పరిస్థితి కనిపించడం లేదు. అలాగే నగర శివార్లలో చేపట్టనున్న మెట్రో విస్తరణ పనులకు అత్తెసర కేటాయింపులే చేశారు. దీన్నిబట్టి ఈ ఏడాది మెట్రో విస్తరణ పనులు ఎంత వరకు ముందుకు వెళ్తాయో కూడా అర్థంకాని పరిస్థితి నెలకొంది. ఇదిలా ఉంటే నగర శివార్లలో కొత్తగా నిర్మించతలపెట్టిన ఫ్యూచర్ సిటీపై ప్రభుత్వం ఎక్కువ ఫోకస్ పెట్టింది. రాష్ట్రానికే కాదు దేశానికే తలమానికంగా ఉండే మొట్టమొదటి నెట్ జీరో ఫ్యూచర్‌సిటీ నిర్మాణానికి అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని మంత్రి భట్టి తెలిపారు. ప్రపంచంలోనే అత్యుత్తమ నగరాలతో పోటీపడేలా కాలుష్యరహితంగా, అత్యంత ఆధునిక సదుపాయాలతో దీన్ని నిర్మిస్తున్నామని చెప్పారు. శ్రీశైలం- నాగార్జునసాగర్ హైవేల మధ్యన ఉన్న 56 గ్రామాల్లోని 765 చదరపు కిలోమీటర్ల పరిధిలో ఈ ఫ్యూచర్ సిటీని ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ మెగా అర్బన్ ప్రాజెక్టును పర్యవేక్షించడానికి ఫ్యూచర్‌సిటీ డెవలప్‌మెంట్ అథారిటీ ఏర్పాటు చేశామని చెప్పారు. ఈ సిటీలో మల్టీమోడల్ కనెక్టివిటీ, ఎలక్ట్రిక్ పబ్లిక్ ట్రాన్స్‌పోర్టు, గ్రీన్ బిల్డింగ్‌ల వంటి ఆధునిక సౌకర్యాలు ఉంటాయి. ఏఐసిటీ, ఫార్మాహబ్, స్పోర్ట్స్‌సిటీ, క్లీన్ ఎనర్జీ ఇన్నోవేషన్ తదితర జోన్లు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. అలాగే కొత్తగా ఏర్పాటు చేసిన పురపాలక సంఘాలు, పట్టణాభివృద్ధి సంస్థల్లో మౌలిక సదుపాయాల కల్పన, అభివృద్ధికి రూ.4500కోట్లు కేటాయించారు. ఇందులో సింహభాగం నిధులు ఉమ్మడి రంగారెడ్డిజిల్లాలోని పురపాలికలకు అందుతాయి. వచ్చే మూడేళ్లలో ఈ నిధులు ఖర్చుచేయనున్నారు. గ్రీన్ స్థిరత్వాన్ని మెరుగుపరిచేందుకు శంకరపల్లి వద్ద 250 మెగావాట్లు బ్యాటరీ ఎనర్జీ సిస్టమ్ ఏర్పాటు చేయనున్నట్లు మంత్రి వెల్లడించారు. ఓఆర్ఆర్ చుట్టుపక్కల ఫేజ్-2 కింద చేపడుతున్న నీటి సరఫరా ప్రాజెక్టు చివరిదశకు చేరుకుంది. దీని ద్వారా హెచ్‌ఎండీఏ పరిధిలోని ప్రాంతాలకు తాగునీరు అందిస్తామని మంత్రి తెలిపారు. మూసీనది అభివృద్ధి ప్రాజెక్టుకు రాష్ట్ర బడ్జెట్‌లో గత ఏడాది మాదిరిగానే ప్రభుత్వం రూ.1500కోట్లు కేటాయించింది. ఔటర్ రింగురోడ్డుకు ఆనుకొని హైదరాబాద్ నగరం నలువైపులా శాటిలైట్ టౌన్‌షిప్‌లను ఏర్పాటు చేసి, అల్పాదాయ, మధ్యతరగతి వర్గాలకు అందుబాటులో ఉండే విధంగా గృహ సముదాయాలను నిర్మించే ప్రణాళికలను అమలు చేస్తామని తెలిపింది.



మెట్రో విస్తరణకు నిధులేవీ?

2024-25 వార్షిక బడ్జెట్‌లో మెట్రో రైలు విస్తరణకు అంతంత మాత్రంగానే నిధులు కేటాయించారు. నగర శివార్లలోని ఫ్యూచర్ సిటీతో పాటు శంషాబాద్ ఎయిర్‌పోర్టు, మేడ్చల్, శామీర్‌పేట, హయత్‌నగర్ వరకు మెట్రో రైల్ విస్తరణ చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిన సంగతి తెలిసిందే. దీనికి సంబంధించిన రూట్‌మ్యాప్ కూడా విడుదల చేసింది. అయిదు కారిడార్లకు రూ.24,269 కోట్ల అంచనా వేయగా తాజా బడ్జెట్‌లో రూ.1100 కోట్లు కేటాయించింది. ఇందులో ఓల్డ్‌సిటీ కారిడార్‌కు రూ.500 కేటాయించగా నాగోల్-ఎయిర్‌పోర్టు కారిడార్‌కు రూ.100 కోట్లు మాత్రమే కేటాయించింది. బడ్జెట్‌లో అత్తెసరు నిధులు కేటాయించడం చూస్తే ఈ ప్రాజెక్టు పనులు ఈ ఏడాది మొదలయ్యే అవకాశాలు కనిపించడం లేదు.

ఎయిర్‌పోర్టు నుంచి నేరుగా...

రాష్ట్రంలో పర్యాటకరంగ అభివృద్ధి కోసం తీసుకుంటున్న చర్యల్లో భాగంగా ప్రముఖ సందర్శనీయ స్థలాలకు శంషాబాద్ ఎయిర్‌పోర్టు నుంచి కనెక్టివిటీ పెంచాలని ప్రభుత్వం నిర్ణయించింది. ప్రత్యేక టూరిజం ప్రాంతాల (ఎస్‌టీఏ) అభివృద్ధి కింద రాష్ట్రవ్యాప్తంగా గుర్తించిన ప్రముఖ సందర్శనీయ స్థలాల్లో హెలిప్యాడ్‌ల నిర్మాణం చేపడతారు. విదేశాల నుంచి వచ్చే పర్యాటకులు శంషాబాద్ ఎయిర్‌పోర్టు నుంచి నేరుగా సందర్శనీయ ప్రాంతాలకు వెళ్లేందుకు ఏర్పాట్లు చేస్తామన్నారు.

మామిడిపల్లిలో పశుటీకాల రీసెర్చ్ కేంద్రం

మామిడిపల్లిలో పశుటీకాల పరిశోధన సంస్థ ఏర్పాటు చేయనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. పశు టీకాల కోసం వెటర్నరీ బయోలాజికల్ రిసెర్చ్ ఇనిస్టిట్యూట్‌ను మామిడిపల్లికి తరలించనున్నట్లు తెలిపింది. అన్ని ఆధునిక సౌకర్యాలతో రూ.300 కోట్లతో దీన్ని విస్తరించనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. అలాగే చేపల ఎగుమతిని ప్రోత్సహించడానికి రంగారెడ్డి జిల్లా కొహెడలో రూ.47 కోట్లతో హోల్‌సేల్ చేపల మార్కెట్‌ను ఏర్పాటు చేయనున్నట్లు బడ్జెట్‌లో తెలిపారు. రాష్ట్రంలో మేలు జాతి పాడి పశువులను వృద్ధి చేయడానికి రంగారెడ్డి జిల్లా కంసాన్‌పల్లిలో ఫ్రోజెన్ సెమన్ బుల్‌స్టేషన్‌ను రూ.21 కోట్లతో నిర్మించనున్నారు.

మేడ్చల్, వికారాబాద్ వాసులకు నిరాశ

మేడ్చల్ జిల్లాలో 10వేల ఎకరాల్లో రూ.450కోట్లతో ఉద్యాన పంటల హబ్ ఏర్పాటు చేస్తామని గతంలో హామీ ఇచ్చినప్పటికీ ఈ బడ్జెట్‌లో ఈ ప్రస్తావనే లేదు. అలాగే బడ్జెట్‌లో వికారాబాద్ జిల్లా అభివృద్ధికి దోహదపడే విధంగా ఎలాంటి ప్రత్యేక ప్రకటనలు లేకపోవడం జిల్లా వాసులను తీవ్ర నిరాశకు గురిచేసింది. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ వికారాబాద్ జిల్లా నుంచే ప్రాతినిధ్యం వహిస్తున్నప్పటికీ ఈ బడ్జెట్‌లో జిల్లాకు మొండిచేయి లభించింది. ప్రకృతి సౌందర్యానికి నిలయమైన అనంతగిరి కొండలను పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతామని గతంలో అనేక సార్లు ప్రకటించినా ప్రత్యేక నిధులేమీ కేటాయించలేదు. తెలంగాణ ఊటీగా పేరొందిన అనంతగిరి కొండలను పర్యాటకపరంగా అభివృద్ధి చేస్తే సందర్శకుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది. వికారాబాద్‌లో గ్రామీణ విశ్వవిద్యాలయం ఏర్పాటు చేయాలని గత రెండు దశాబ్దాలుగా ఈ ప్రాంత విద్యార్థులు డిమాండ్ చేస్తున్నారు. దీనిపై కూడా ఈ బడ్జెట్‌లో ప్రస్తావన లేదు.

ప్రజలను మభ్యపెట్టేలా ఉంది



రాష్ట్ర బడ్జెట్ పేదల కష్టాలను తీర్చేలా లేదు. ఆరు గ్యారెంటీల అమలుపై స్పష్టత లేదు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలపై ఊసే లేదు. ప్రజలను మభ్యపెట్టే విధంగా ఉంది. ప్రజలు ప్రభుత్వానికి బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారు.

-మల్లారెడ్డి, ఎమ్మెల్యే, మేడ్చల్

మేడ్చల్‌కు మొండి చేయి



బడ్జెట్‌లో మేడ్చల్ జిల్లాకు రాష్ట్ర ప్రభుత్వం మొండి చేయి చూపింది. కనీస నిధులు కేటాయించకపోవడం దారుణం. విద్యా, వైద్య రంగాలకు కేటాయింపులు పెంచాలి. జిల్లాలో రింగు రోడ్డు లోపల ఉన్న గ్రామాలను మున్సిపాల్టీల్లో విలీనం చేశారు. వాటి అభివృద్ధికి కూడా నిధులు కేటాయించలేదు.

-విక్రంరెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు

ప్రస్తుత పరిస్థితిలో మేలైన బడ్జెట్



ప్రస్తుత పరిస్థితుల్లో ఇది మేలైన బడ్జెట్. పూర్తి సంతృప్తికరంగా లేకపోయినా కొంత పర్వాలేదు. కేంద్రం సహకరించకపోయినా ప్రభుత్వం సంక్షేమ పథకాల అమలులో నెట్టుకొస్తోంది. కానీ ఈ బడ్జెట్ ఆశించిన స్థాయిలో లేదు. కేంద్రం సహకరించడం లేదు.

-విజయలక్ష్మి పండిత్, సీపీఐ జిల్లా కార్యదర్శి, వికారాబాద్

అన్ని వర్గాలకు అనుకూలంగా...



రంగారెడ్డి అర్బన్ : అన్ని వర్గాల సంక్షేమం, అభివృద్ధి కోసం రూపొందించిన బడ్జెట్‌ను రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టింది. విద్య, వైద్యం, వ్యవసాయం, పారిశ్రామిక రంగాలతోపాటు రైతులు, ఉద్యోగులు, మహిళలు, బడుగు బలహీన వర్గాలు, విద్యార్థులు, కార్మికుల అభ్యున్నతి కోసం ప్రవేశపెట్టిన బడ్జెట్‌పై కొందరి లేనిపోని విమర్శలు చేస్తున్నారు.

- పట్నం మహేందర్‌రెడ్డి, ప్రభుత్వ చీఫ్ విప్

ఇది ప్రజా సంక్షేమ బడ్జెట్



షాద్‌నగర్ : ప్రజా సంక్షేమాన్ని ఆకాంక్షించి కాంగ్రెస్ ప్రభుత్వం బడ్జెట్ ప్రవేశ పెట్టింది. ఇరిగేషన్ ప్రాజెక్టుల కోసం రూ.23వేల కోట్లు కేటాయించింది. ఈ నిధులతో లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ నిర్మాణానికి మోక్షం లభించనుంది. అలాగే ఫరూఖ్‌నగర్ మండలం కంసాన్‌పల్లి వద్ద నిలిచిపోయిన పశువీర్య ఉత్పత్తి కేంద్ర నిర్మాణాన్ని తిరిగి ప్రారంభించేందుకు బడ్జెట్‌లో రూ.20కోట్లు ప్రత్యేకంగా కేటాయించింది.

- వీర్లపల్లి శంకర్, ఎమ్మెల్యే షాద్‌నగర్

విద్య, వైద్యానికి మరిన్ని నిధులిస్తే బాగుండేది



షాద్‌నగర్ : బడ్జెట్‌లో విద్య, వైద్యానికి మరిన్ని నిధులు కేటాయిస్తే బాగుండేది. అలాగే పేదరిక నిర్మూలన కోసం కూడా ప్రత్యేంగా నిధులు కేటాయించాల్సిన అవసరం అలాగే ఇరిగేషన్ ప్రాజెక్టులు త్వరితగతిన పూర్తి చేసేందుకు కనీసం రూ.30వేల కోట్లు కేటాయించాల్సిన అవసరం ఉంది.

- బక్కని నర్సింహులు, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు

ఇది అంకెల గారెడీ బడ్జెట్



శంషాబాద్ రూరల్ : కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ అంకెల గారెడీగా ఉంది. దీనివల్ల ప్రజలకు ఎలాంటి ఉపయోగం లేదు. ప్రభుత్వం ఇచ్చిన గ్యారెంటీలకు బడ్జెట్‌కు పోలికే లేదు. ఈ బడ్జెట్‌లో అన్ని రంగాలకు మొండిచేయి చూపించారు. ముఖ్యంగా విద్యకు సరైన నిధులు కేటాయించలేదు.

- రాజ్‌భూపాల్‌గౌడ్, బీజేపీ రూరల్ జిల్లా అధ్యక్షుడు

అన్ని రంగాలకు ప్రాధాన్యం



బడ్జెట్‌లో వ్యవసాయరంగం, మహిళలు, యువజన వికాసం, ఎస్సీ ఎస్టీ, బీసీ, మైనార్టీలు పెద్దపీటవేసింది. యువతకు ఉద్యోగాలు కల్పించే విధంగా నిధులు ప్రకటించారు. వ్యవసాయ శాఖకు రూ.24,439 కోట్ల భారీ నిధులు కేటాయించిన ఘనత రేవంత్‌రెడ్డి ప్రభుత్వానికి దక్కింది. అన్ని వర్గాల సంక్షేమం కోరే విధంగా ఈ బడ్జెట్ ఉంది.

- రామ్మోహన్‌రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్యే . పరిగి

ఇది అభివృద్ధిని సూచించే బడ్జెట్



కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టింది ప్రజా బడ్జెట్. పేదరికాన్ని నిర్మూలించే దిశగా పద్దును రూపొందించారు. లక్ష్మీదేవిపల్లి ప్రాజెక్టుకు నిధులు కేటాయించడం సంతోషకరం. ఎన్నికల ప్రచారంలో చెప్పిన ఆరు గ్యారెంటీలను తక్కువ కాలంలో అమలు చేస్తున్నారు.

-బుయ్యని మనోహర్‌రెడ్డి, ఎమ్మెల్యే, తాండూరు

విద్య, వైద్యానికి మొండిచెయ్యి



ఈ బడ్జెట్‌లో విద్య, వైద్యానికి ప్రాధాన్యత ఇవ్వలేదు. ప్రజలకు ఇచ్చిన హామీలను పక్కన పెట్టి కాంగ్రెస్ కార్యకర్తల కోసం రూ.6వేల కోట్లు కేటాయించడం ప్రభుత్వ విధానాలకు అద్దం పడుతోంది. దానికి 'యువ వికాసం' పేరుతో తెలంగాణ వినాశనాన్ని ఈ ప్రభుత్వం కోరుతుంది. ఢిల్లీకి మూటలు పంపేందుకు పెట్టిన బడ్జెట్‌గా మాత్రమే కనిపిస్తోంది. ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీలు 420 హామీలను పట్టించుకోలేదు.

-ఆనంద్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, వికారాబాద్

జిల్లాకు గాడిద గుడ్డే...



బడ్జెట్‌లో వికారాబాద్ జిల్లాకు ఒరిగిందేమీ లేదు. గాడిద గుడ్డే ఇచ్చారు. వికారాబాద్, తాండూరు, పరిగి ప్రాంతాలకు ఒక పరిశ్రమ కూడా ఇవ్వలేదు. రైతులకు తగిన గిట్టుబాటు ధర కల్పించే ప్రయత్నం చేయలేదు. హైదరాబాద్‌కు సమీపంలో ఉన్నా తలసరి ఆదాయం అత్యంత తక్కువ ఉన్న జిల్లా వికారాబాద్ కావడం శోచనీయం. నిధుల కేటాయింపుల్లో కొడంగల్‌కు ప్రాధాన్యత ఇస్తూ.. తాండూరు, పరిగి, వికారాబాద్‌కు మొండిచెయ్యి చూపారు.

-కొప్పుల రాజశేఖర్‌రెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు, వికారాబాద్

ప్రొసీడింగ్స్ తెస్తే సరిపోతుందా?

- అభివృద్ధి చేసి చూపెట్టాలి!
- బీఆర్ఎస్‌పై కాంగ్రెస్ నాయకుల ఆగ్రహం



మాట్లాడుతున్న సుదర్శన్‌గౌడ్, నాయకులు

కొత్తూర్, మార్చి 19(ఆంధ్రజ్యోతి): గతఅసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని మున్సిపాలిటీ కోసం బీఆర్ఎస్ నాయకులు హడావుడి చేసి ప్రొసీడింగ్స్ తెచ్చి చేతులు దులుపుకున్నారే తప్పా.. నిధులు తీసుకురావడంలో పూర్తిగా విఫలమైనారని కాంగ్రెస్ పార్టీ మున్సిపల్ శాఖ అధ్యక్షుడు జె.సుదర్శన్‌గౌడ్, మాజీ సర్పంచ్ జనిగె జగన్, కౌన్సిలర్లు హేమా దేవేందర్‌ముదిరాజ్, కమ్మరి జయమ్మ జనార్దన్‌చారి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఇందూరి శ్రీనివాస్, నవీన్‌చారి, కర్రొళ్ల సురేందర్‌లు ఘాటుగా విమర్శించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ లావణ్య దేవేందర్‌యాదవ్, వైస్‌చైర్మన్ జోలీ రవీందర్, పలువురు కౌన్సిలర్లు షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌పై చేసిన ఆరోపణలపై కాంగ్రెస్ నాయకులు స్పందించారు. మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. షాద్‌నగర్ మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ కొత్తూర్ మున్సిపాలిటీని దత్తత తీసుకుని ఎలాంటి అభివృద్ధి చేయకుండా ప్రజలను మోసం చేశారని, గత ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని ప్రొసీడింగ్స్ తెచ్చి హడావుడి చేశారే తప్పా.. నిధులు మంజూరు చేయించలేదన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఎమ్మెల్యే శంకర్ ఆధ్వర్యంలో జేపీ దర్గా, కుమ్మరిగూడ రోడ్లకు రివైజ్‌డ్ ప్రొసీడింగ్ తీసుకొచ్చి నిర్మాణం పనులు ప్రారంభించడం జరిగిందన్నారు. అసంపూర్తిగా మిగిలిపోయిన కొత్తూర్-షాద్‌నగర్ పాత జాతీయ రహదారిని పూర్తి చేసి, రైల్వే బ్రిడ్జితో పాటు, కొత్తూర్ ప్రధాన రహదారిని సుందరంగా తీర్చిదిద్దేందుకు ఎమ్మెల్యే కృషి చేశారని గుర్తుచేశారు. మున్సిపాలిటీకి కోట్లాది రూపాయలు తీసుకొచ్చి అభివృద్ధి చేస్తుంటే, బీఆర్ఎస్ నాయకులకు కళ్లు మండుతున్నాయని విరుచుకపడ్డారు. బీఆర్ఎస్ హయాంలో కొత్తూర్ మున్సిపాలిటీలో ఉన్న మహిళ ప్రజాప్రతినిధులకు మాజీ ఎమ్మెల్యే ఎంత గౌరవం ఇచ్చారో బహిరంగ చర్చకు సిద్ధం కావాలని సవాల్ విసిరారు. ఎమ్మెల్యే శంకర్‌పై లేనిపోని ఆరోపణలు చేస్తే ఖబర్దార్ అంటూ హెచ్చరించారు. కాంగ్రెస్ నాయకులు ఎమ్మె సత్తయ్య, చిల్కమర్రి నర్సింహ, విజయ్‌పాల్‌రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, అక్కవానిగూడ రాజు, పాశం కృష్ణ, జగదీశ్వర్‌గౌడ్, భరత్‌గౌడ్, ఆంజనేయులు, నర్సింహగౌడ్, శివకుమార్‌గౌడ్, పాల్గొన్నారు.

బీసీ మహిళలకు 50శాతం కోటా ఇవ్వాలి

బీసీ సంఘం జాతీయ కార్యవర్గ సభ్యుడు రాజ్‌కుమార్ డిమాండ్



తాండూరులో నిరసన తెలుపుతున్న నాయకులు

తాండూరు, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): పార్లమెంట్‌లో ఆమోదం పొందిన మహిళా బిల్లుల్లో జనాభా ప్రకారం బీసీ మహిళలకు 50శాతం సబ్ కోటా ఇవ్వాలని బీసీ సంఘం జాతీయ కార్యవర్గ సభ్యుడు కందుకూరి రాజ్‌కుమార్ డిమాండ్ చేశారు. బుధవారం తాండూరు బీసీ మహిళా సంఘం ఆధ్వర్యంలో ఢిల్లీలో చేపట్టిన నిరసన కార్యక్రమాలకుసంఘీభావంగా అంబేడ్కర్ విగ్రహం ఎదుట ప్లకార్డులతో నిరసన తెలిపారు. వచ్చే పార్లమెంట్ సమావేశాల్లో బిల్లును ప్రవేశపెట్టాలన్నారు. రాజకీయ రిజర్వేషన్లతోపాటు విద్య, ఉద్యోగ రంగాల్లో బీసీ మహిళలకు 50 శాతం రిజర్వేషన్ కల్పించాలన్నారు. అంతకుముందు బీసీ మహిళా సంఘాల ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీసీ మహిళా సంఘం అధ్యక్షురాలు అనిత, ఉపాధ్యక్షురాలు విజయలక్ష్మి, కార్యదర్శి జగదీశ్వరి, కార్యదర్శి మంజుల, తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్‌ను నిర్మిస్తాం

పరిగి, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల ద్వారా కేపీ లక్ష్మీదేవిపల్లి ప్రాజెక్టు నిర్మాణం చేపడతామని ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క ప్రకటించడం హర్షణీయమని డీసీసీ అధ్యక్షుడు, పరిగి ఎమ్మెల్యే డాక్టర్ రామ్మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. గతంలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఈ ప్రాజెక్టు కోసం అనేకమార్లు పోరాటం చేశామని తెలిపారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్లలో ఉమ్మడి జిల్లాకు తీరని అన్యాయం చేసిందని, కాంగ్రెస్ ప్రభుత్వం సాగునీటి ప్రాజెక్టులకు పెద్దపీట వేస్తుందని చెప్పారు. కేపీ లక్ష్మీదేవిపల్లి ప్రాజెక్టును 2.8 టీఎంసీల కెపాసిటీతో నిర్మాణం చేపట్టబోతున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

బీసీ బిల్లు ఆమోదం హర్షణీయం



సీఎంకు కృతజ్ఞతలు తెలుపుతున్న ఈడిగ శ్రీనివాస్

తాండూరు, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): బీసీలకు విద్య, ఉద్యోగాలు, స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లను 42శాతానికి పెంచుతూ ప్రవేశపెట్టిన బిల్లుకు అసెంబ్లీలో ఏకగ్రీవంగా ఆమోదం పొందడం హర్షణీయమని బీసీ యువజన సంఘం రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు ఈడిగ శ్రీనివాస్ గౌడ్ అన్నారు. బుధవారం అసెంబ్లీలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని పీసీసీ అధ్యక్షుడు మహేష్ గౌడ్, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. కామారెడ్డి డిక్లరేషన్ ప్రకారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రత్యేక చొరవతో కాంగ్రెస్ ప్రభుత్వం చట్టం తీసుకురావడం హర్షనీయమన్నారు. మద్దతు తెలిపిన బీఆర్ఎస్, బీజేపీ, ఎంఐఎం, సీపీఎం పార్టీలకు ధన్యవాదాలు తెలిపారు. బీసీ బిల్లు ఆమోదంపై తదుపరి ఢిల్లీ కేంద్రంగా జరిగే పోరాటంపై అన్ని రాజకీయ పార్టీలు కలిసి రావాలని కోరారు.

కిషన్‌రెడ్డిని కలిసిన రాజ్‌భూపాల్‌గౌడ్



రాజ్‌భూపాల్‌గౌడ్‌కు స్వీటు తినిపిస్తున్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

శంషాబాద్ రూరల్, మార్చి 19(ఆంధ్రజ్యోతి): ఇటీవల రంగారెడ్డి రూరల్ జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికైన పంతంగి రాజ్‌భూపాల్ గౌడ్ బుధవారం కేంద్రమంత్రి కిషన్‌రెడ్డిని, ఎంపీ డాక్టర్ లక్ష్మణ్, కొండా విశ్వేశ్వర్‌రెడ్డిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు. తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా పార్టీ పటిష్టత కోసం కృషి చేస్తానని ఈ సందర్భంగా రాజ్‌భూపాల్ పేర్కొన్నారు. ప్రభుత్వ వ్యతిరేక విధానాలను ప్రజలకు వివరించి ఎండగడుతానని, వచ్చే ఎన్నికల నాటికి పార్టీకి జిల్లాలో పూర్వవైభవం తీసుకొస్తానని పేర్కొన్నారు.

జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ అభియాన్ కోఆర్డినేటర్ల ఎంపిక

తాండూరు/పెద్దేముల్, మార్చి19 (ఆంధ్రజ్యోతి): జైబాపు, జైభీమ్, జై సంవిధాన్ అభియాన్ రాష్ట్ర కోఆర్డినేటర్లుగా తాండూరు ప్రాంతానికి చెందిన పీసీసీ జనరల్ సెక్రటరీ ధారాసింగ్, రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ కల్వ సుజాతలను నియమించారు. బుధవారం ఈమేరకు పీసీసీ సీనియర్ ఉపాధ్యక్షుడు కుమార్‌రావు నియామకాన్ని ప్రకటించారు. నారాయణపేట్‌జిల్లా మక్తల్, నారాయణపేట్ నియోజకవర్గాలకు ధారాసింగ్‌ను, జంటనగరాల్లోని సికింద్రాబాద్, కంటోన్మెంట్ నియోజకవర్గాలకు కల్వ సుజాతను నియమించారు. ఈప్రాంతాలకు వీరు స్టేట్‌కోఆర్డినేటర్లుగా వ్యవహరిస్తారు.

అంచనాకు మించి ఆదాయం



తాండూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ స్పెషల్ గ్రేడ్ సెక్రటరీ శ్రీనివాస్

ఫటాఫట్

తాండూరు, మార్చి 19(ఆంధ్రజ్యోతి): మార్కెట్ కమిటీ ఆదాయం లక్ష్యాన్ని చేరుకుంటున్నాం. రైతుల సంక్షేమం కోసం కృషి చేస్తూ మార్కెట్ యార్డు విస్తరణ చేపడుతున్నామని తాండూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ స్పెషల్ గ్రేడ్ సెక్రటరీ శ్రీనివాస్ అన్నారు.

ఈ ఏడాది మార్కెట్ కమిటీ ఆదాయ లక్ష్యం ఎంత?

తాండూరు మార్కెట్ ఆదాయం రూ.6.77 కోట్లు లక్ష్యం కాగా ఇప్పటివరకు రూ.6 కోట్ల 50లక్షలు వసూలైంది. ఇంకా రూ.27 లక్షలు వసూలు చేయాల్సి ఉంది.

గతేడాది మార్కెట్‌కు ఎంత ఆదాయం వచ్చింది?

లక్ష్యాన్ని మించి రూ.4 లక్షలు ఎక్కువ వసూలు చేశాం. ఈ ఏడాది లక్ష్యాన్ని దాటుతాం.

ఇనామ్ పని చేయడం లేదని ఆరోపణలు ఉన్నాయి?

ఇనామ్ సర్వర్ డౌన్, సాంకేతిక సమస్యలున్నప్పటికీ క్రయవిక్రయాలకు ఎలాంటి ఇబ్బందులు లేవు.

మార్కెట్‌లో కందుల క్రయవిక్రయాలు ఎలా ఉన్నాయి?

లక్షా 20 వేల క్వింటాళ్ల కందుల క్రయవిక్రయాలు జరిగాయి. రూ.100 కోట్ల వ్యాపారం చేశాం.

కొత్త మార్కెట్ ఏర్పాటు ఎంత వరకు వచ్చింది?

కొత్త మార్కెట్ యార్డు కోసం రూ.34 కోట్లతో ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపాం. దీనికోసం 30 ఎకరాలు కేటాయించాం.

పత్తి క్రయ విక్రయాలు ఎలా ఉన్నాయి ?

పత్తి క్రయ విక్రయాలపై రూ.1.26 కోట్లు ఫీజ్ వసూలైంది.



సభ్యత్వాల నమోదులో యూనియన్ రాష్ట్ర నాయకులు

జర్నలిస్టుల హక్కుల సాధనకు పోరాటం

కొడంగల్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): జర్నలిస్టుల హక్కుల సాధనకు పోరాటానికి సిద్ధం కావాలని టీయూడబ్ల్యూజే (ఐజేయూ) యూనియన్ రాష్ట్ర నాయకులు కిషన్‌రావు, పకీరప్ప పిలుపునిచ్చారు. బుధవారం కొడంగల్‌లో యూనియన్ సభ్యత్వాల నమోదును ప్రారంభించారు. కార్యక్రమంలో జర్నలిస్టులు పృథ్వీరాజ్, కత్తి ప్రభాకర్, అనంతప్రసాద్, శ్రీకాంత్, నరేశ్‌కుమార్, రాచయ్య, నరేందర్ పాల్గొన్నారు.

బొంరాస్‌పేట్ మండల కేంద్రానికి ఫోర్‌వే లేన్

బొంరాస్‌పేట్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): బొంరాస్‌పేట్ మండల కేంద్రానికి రూ.22 కోట్లతో ఫోర్ లేన్ రోడ్డు మంజూరైందని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేశ్‌రెడ్డి తెలిపారు. 163వ జాతీయ రహదారి నుంచి మండల కేంద్రంలో బురాన్‌పూర్ వై జంక్షన్ వరకు రెండు కిలో మీటర్ల మేర రోడ్డు మంజూరైందని చెప్పారు. ఇప్పటికే టెండర్లు పూర్తయ్యాయన్నారు. బుధవారం ఆర్‌అండ్‌బీ అధికారులు, పీఏసీఎస్ చైర్మన్ జయకృష్ణ, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నర్సింహులుగౌడ్‌తో కలిసి రోడ్డును పరిశీలించారు.

ఆదర్శం.. మేకవనంపల్లి పాఠశాల

మోమిన్‌పేట్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): మేకవనంపల్లి ఉన్నత పాఠశాల ఆదర్శంగా నిలిచిందని మర్పల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ మహేందర్‌రెడ్డి అన్నారు. బుధవారం నిర్వహించిన పాఠశాల వార్షికోత్సవానికి వ్యక్తిత్వ వికాస నిపుణుడు మహేందర్ గురూజీతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఎంఈవో మల్లేశం, మేకవనంపల్లి సొసైటీ చైర్మన్ అంజిరెడ్డి, ప్రధానోపాధ్యాయుడు గౌరీశంకర్, కేజీబీవీ ప్రిన్సిపాల్ ప్రభావతి, ఉపాధ్యాయులు మహేందర్, మాజీ ఎంపీటీసీ గోవర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

అభివృద్ధిలో చెనిగేశ్‌పూర్‌కు ప్రాధాన్యం



చెనిగేశ్‌పూర్‌లో సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న నాయకులు

తాండూరురూరల్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చెనిగేశ్‌పూర్‌లో ఎన్ఆర్ఈజీఎస్ నిధులు రూ.5 లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు పనులను బుధవారం కాంగ్రెస్ గ్రామ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి సీనియర్ నాయకుడు గూడెపు శ్రీనివాస్‌తో కలిసి ప్రారంభించారు. ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి గ్రామాన్ని అన్ని విధాల అభివృద్ధి చేయిస్తున్నారన్నారు. నాయకులు కుర్వ మల్లప్ప, గోవిందర్‌రాజ్‌గౌడ్, ప్రవీణ్‌గౌడ్ ఉన్నారు.

జాబ్‌మేళాకు స్పందన

కీసర, మార్చి19 (ఆంధ్రజ్యోతి): ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షుడు బెలిదె రమేష్ గుప్తా ఆధ్వర్యంలో బుధవారం కీసర కల్యాణ మండపంలో నిర్వహించిన జాబ్‌మేళాకు స్పందన వచ్చింది. 10వ తరగతి నుంచి డిగ్రీ చదువుకున్న వారు ఇంటర్వ్యూలకు హాజరయ్యారు. దాదాపు 15 కంపెనీలు పాల్గొని పలువురికి ఉద్యోగ అవకాశాలు కల్పించాయి.

వ్యాపారుల లైసెన్స్‌ల పరిశీలన

చౌడాపూర్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోలుదారులు కచ్చితంగా వృత్తి వ్యాపార లైసెన్స్ కలిగి ఉండాలని మార్కెట్ కమిటీ చైర్మన్ బీఎస్ ఆంజనేయులు అన్నారు. బుధవారం చౌడాపూర్ మండలంలోని అన్ని గ్రామాల్లో ధాన్యం కొనుగోలుదారుల లైసెన్స్‌లను పరిశీలించారు.

విద్యార్థులు 15,930.. సెంటర్లు 69

(5వ పేజీ తరువాయి)

ఉన్న జిరాక్స్, కంప్యూటర్ సెంటర్లను మూసివేసేలా చర్యలు తీసుకోనున్నారు. పరీక్ష విధులు నిర్వహించే సిబ్బంది తప్పనిసరిగా ఫొటో గుర్తింపు కార్డు ధరించేలని ఆదేశాలు జారీ చేశారు.

సకాలంలో సెంటర్లకు చేరుకునేలా..

విద్యార్థులు పరీక్షా కేంద్రాలకు సకాలంలో చేరుకునేందుకు వీలుగా ప్రత్యేక బస్సులను నడిపించాలని ఆర్టీసీ అధికారులకు విజ్ఞప్తి చేశారు. విద్యార్థులు పదో తరగతి హాల్ టికెట్ చూపిస్తే బస్సుల్లో ఉచితంగా ప్రయాణించేందుకు అనుమతించనున్నారు. విద్యార్థులు సకాలంలో పరీక్ష కేంద్రాలకు చేరుకునే విధంగా ఆర్టీసీ అధికారులు రూట్ మ్యాపింగ్ సిద్ధం చేసుకున్నారు.

గంట ముందుగానే రావాలి

విద్యార్థులు గంట ముందుగానే కేంద్రాలకు చేరుకోవాలని విద్యా శాఖ అధికారులు సూచించారు. పరీక్ష ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు కొనసాగనుంది. విద్యార్థులను 9 గంటల నుంచి కేంద్రాల్లోకి అనుమతించనున్నారు. అన్ని పరీక్ష కేంద్రాల వద్ద డీఈవో, ఎంఈవోల సెల్ ఫోన్ నెంబర్లను ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటున్నారు. విద్యార్థులు వెబ్‌సైట్ నుంచి హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకుని పరీక్షకు హాజరు కావచ్చు.



హాల్ టికెట్లు చూపిస్తున్న విద్యార్థులు

పకడ్బందీగా పరీక్షలు నిర్వహించాలి

తాండూరురూరల్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి) : రేపటి నుంచి ప్రారంభమయ్యే పదో తరగతిపరీక్షలను పకడ్బందీగా నిర్వహించేలా చర్యలు చేపట్టాలని అడిషనల్ కలెక్టర్లు లింగ్యానాయక్, సుధీర్ అధికారులను ఆదేశించారు. బుధవారం తాండూరు మండల పరిషత్ కార్యాలయంలో కస్టోడియన్లు, డిపార్ట్‌మెంట్ అధికారులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో మాస్ కాపీయింగ్‌కు పాల్పడ్డారని, అలాంటి సంఘనలు పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాలన్నారు. డీఈవో రేణుకాదేవి, డీఎస్పీ బాలకృష్ణారెడ్డి, మున్సిపల్ కమిషనర్ విక్రమసింహారెడ్డి, ఎంపీడీవో విశ్వప్రసాద్, విద్యాధికారి వెంకటయ్య, సీఐ సంతోష్‌కుమార్ పాల్గొన్నారు.

బీసీల పక్షపాతి సీఎం రేవంత్‌రెడ్డి

జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేశ్‌రెడ్డి

బొంరాస్‌పేట్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): బీసీల పక్షపాతిగా ఇచ్చిన హామీ మేరకు 42 శాతం రిజర్వేషన్ బాధ్యతను సీఎం రేవంత్‌రెడ్డి నెరవేర్చారని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేశ్‌రెడ్డి అన్నారు. బుధవారం బొంరాస్‌పేట్‌లోని భూలక్ష్మమ్మ చౌరస్తాలో బీసీ, కాంగ్రెస్ నాయకులతో కలిసి సీఎం రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో నాయకులు నర్సింహులు గౌడ్, జయకృష్ణ, వెంకట్రాములుగౌడ్, రాంచంద్రారెడ్డి పాల్గొన్నారు.

మన్నెగూడలో..

పూడూరు: మండల పరిధిలోని మన్నెగూడ చౌరస్తాలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. అసెంబ్లీలో బీసీ రిజర్వేషన్ల బిల్లు, ఎస్సీ వర్గీకరణ బిల్లు, రాజీవ్ యువ వికాస్ బిల్లులు ఆమోదించినందున సందర్భంగా కాంగ్రెస్ నాయకులు సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సురేందర్ ముదిరాజ్, పీఏసీఎస్ చైర్మన్ సతీష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బషీరాబాద్: ఎన్నికల ముందు బీసీలకు న్యాయం చేస్తానని చెప్పిన సీఎం రేవంత్‌రెడ్డి మాట నిలబెట్టుకున్నారని బషీరాబాద్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కలాల్ నర్సింహులుగౌడ్ పేర్కొన్నారు. బీసీలకు విద్య, ఉద్యోగ, రాజకీయాల్లో 42 శాతం రిజర్వేషన్ అవకాశం కల్పిస్తున్నారన్నారు.



రేవంత్‌రెడ్డి, రాహుల్‌గాంధీ చిత్రపటాలకు పాలాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

తాండూరు: ఎన్నికల ముందు పీసీసీ అధ్యక్షుడి హోదాలో సీఎం రేవంత్‌రెడ్డి బీసీ వర్గాలకు ఇచ్చిన మాట ప్రకారం 42 శాతం రిజర్వేషన్ అమలుచేస్తున్నారని వికారాబాద్ కాంగ్రెస్ జిల్లా యువజన విభాగం కార్యదర్శి అనిల్‌కుమార్ గౌడ్ అన్నారు. బీసీ సామాజిక ప్రజలు రేవంత్‌రెడ్డికి రుణపడి ఉంటారని చెప్పారు.

కొడంగల్: అసెంబ్లీలో ఎస్సీ వర్గీకరణను ఆమోదించడంతో కాంగ్రెస్ దళిత సంఘం నాయకులు హర్షం వ్యక్తం చేస్తూ స్థానిక అంబేడ్కర్ చౌరస్తాలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల ప్రచార కార్యదర్శి సోమశేఖర్, పట్టణ వర్కింగ్ ప్రసిడెంట్ దాము తదితరులు పాల్గొన్నారు.

ఘట్‌కేసర్: ఎస్సీ వర్గీకరణకు అసెంబ్లీలో చట్టబద్ధత కల్పించడం చరిత్రాత్మకమని తెలంగాణ ఎమ్మార్పీఎస్ కన్వీనర్ డాక్టర్ మీసాల మల్లేష్ అన్నారు. ఘట్‌కేసర్‌లోని అంబేడ్కర్ చౌరస్తాలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో నాయకులు మల్లేష్, నర్సింహ, శ్రీనివాస్, లక్ష్మీనారాయణ, మహిపాల్, సత్యనారాయణ, మల్లేష్, రమేష్ పాల్గొన్నారు.

మందకృష్ణ మాదిగ చిత్రపటానికి..

కీసర: అసెంబ్లీలో ఎస్సీ వర్గీకరణ బిల్లుకు ఆమోదం తెలపడం, వర్గీకరణ కోసం 30 ఏళ్లుగా ఉద్యమం చేసిన మందకృష్ణ మాదిగకు కృతజ్ఞతలు తెలిపారు. బుధవారం కీసర చౌరస్తా వద్ద పలువురు దళిత సంఘాల నేతలు మందకృష్ణ మాదిగ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు.

కీసరలో..

కీసరరూరల్: ఎస్సీ వర్గీకరణ ఆమోదం పొందటంపై నాగారం మున్సిపాలిటీ రాంపల్లి ఎమ్మార్పీఎస్ నాయకులు రాంపల్లి ప్రధాన కూడలిలో మంద కృష్ణ మాదిగ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు మహేందర్, రాంపల్లి అధ్యక్షుడు పరమేష్ తదితరులు పాల్గొన్నారు.



కులకచర్ల: సీసీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఆంజనేయులు

రోడ్ల నిర్మాణాలతో గ్రామాల అభివృద్ధి

కులకచర్ల, మార్చి 19(ఆంధ్రజ్యోతి): సీసీ రోడ్ల నిర్మాణాలతో గ్రామాల రూపురేఖలు మారుతున్నాయని మార్కెట్ కమిటీ చైర్మన్ బీఎస్ ఆంజనేయులు అన్నారు. బుధవారం కులకచర్లలో ఉపాధిహామీ నిధులు రూ.5 లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక గ్రామాలు, తండాలు అభివృద్ధి పథంలో దూసుకెళ్తున్నాయన్నారు. కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ మొగులయ్య, డీసీసీ ఉపాధ్యక్షుడు భీమ్‌రెడ్డి, కాంగ్రెస్ మండల ప్రధాన కార్యదర్శి గోపాల్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

మోమిన్‌పేట్: మండలంలోని దుర్గంచెరువు వద్ద బుధవారం రూ.40 లక్షలతో సీసీ రోడ్డు పనులను మర్పల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ మహేందర్‌రెడ్డి ప్రారంభించారు. అలాగే సీఎంఆర్ఎఫ్ కింద మంజూరైన చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. ఆయన వెంట నాయకులు సుభాష్‌గౌడ్, మానెయ్య, వెంకటయ్య, కృష్ణ, సురేందర్, చంద్రయ్య, గిరిసింగ్, ప్రవీణ్‌కుమార్, బాల్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

గ్రామాల అభివృద్ధికి పెద్దపీట

కొడంగల్: గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నందారం ప్రశాంత్ అన్నారు. బుధవారం కొడంగల్ మున్సిపల్ పరిధిలోని పాత కొడంగల్ తండా నుంచి ఎక్కచెరువు తండాకు చేపట్టిన బీటీ రోడ్డు నిర్మాణ పనులకు భూమిపూజ చేశారు. మాజీ కౌన్సిలర్ శంకర్‌నాయక్, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, గొల్ల బుగ్గప్ప, పాండునాయక్, మోతిలాల్, తార్యానాయక్, సుభాష్‌నాయక్, రాములు పాల్గొన్నారు.

సీసీ రోడ్ల నిర్మాణానికి రూ.3.65 కోట్లు

తాండూరురూరల్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణానికి ఎన్ఆర్ఈజీఎస్ కింద రూ.3.65 కోట్లు మంజూరయ్యాయని, తాండూరు పంచాయతీరాజ్ ఈఈ సత్యనారాయణ రెడ్డి పేర్కొన్నారు. బషీరాబాద్ మండలానికి రూ.60లక్షలు, యాలాలకు రూ.1కోటి 75లక్షలు, పెద్దేముల్‌కు రూ.75ల క్షలు, తాండూరుకు రూ.35లక్షలు, కోట్‌పల్లి మండలానికి రూ.25లక్షలు మంజూరైనట్లు వివరించారు. ఈ పనులను ఆయా గ్రామాల్లో కాంట్రాక్టర్లు ఈనెల 25నాటికి సీసీ రోడ్ల నిర్మాణం పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు.

సంస్కృతి టౌన్‌షిప్‌నకు గేటెడ్ హోదాకు కృషి

ఘట్‌కేసర్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): పోచారం సంస్కృతి టౌన్‌షిప్‌ను గేటెడ్ కమ్యూనిటీగా మార్చేందుకు చర్యలు తీసుకుంటామని టీపీసీసీ ఉపాధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్ అన్నారు. బుధవారం టౌన్‌షిప్‌లో ఏర్పాటు చేసిన ఎలక్ట్రిక్ వాహనాల చార్జింగ్ స్టేషన్‌ను, ఎమర్జెన్సీ మెడికల్ కేర్ సెంటర్‌ను డీసీసీ అధ్యక్షుడు సింగిరెడ్డి హరివర్ధన్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. సంస్కృతి టౌన్‌షిప్‌కు గేటెడ్ కమ్యూనిటీకి ఉండాల్సిన అన్ని అర్హతలు ఉన్నాయన్నారు. కార్యక్రమంలో మహేశ్, వెంకటేశ్‌గౌడ్, శ్రీకాంత్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ వీరారెడ్డి, అసోసియేషన్ ఉపాధ్యక్షుడు సత్యనారాయణ, కార్యదర్శి ఇందిర ప్రియదర్శిని, సభ్యులు దీపక్, రోహిత్, టౌన్‌షిప్ వాసులు పాల్గొన్నారు.

'ఉపాధి' పనుల పురోగతిపై సమీక్ష

దోమ, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): దోమ మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం ఎంపీడీవో గమ్యా ఉపాధిహామీపనులపై సమీక్ష నిర్వహించారు. కూలీలకు 100 రోజులు కల్పించాలని సిబ్బందికి సూచించారు. స్వచ్ఛ భరత్ కింద మంజూరైన మరుగుదొడ్ల నిర్మాణాలను త్వరగా పూర్తి చేయాలన్నారు. గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా పంచాయతీ కార్యదర్శులు ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

ధర్నా చేస్తే ఆశాలను అరెస్ట్ చేస్తారా?

తాండూరు/యాలాల, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తే అరెస్ట్ చేయడం సరైంది కాదని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాస్ ధ్వజమెత్తారు. బుధవారం తాండూరు, యాలాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ ఆశా వర్కర్లకు కనీస వేతనం రూ.18వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. నాయకులు బుగ్గప్ప, సులోచన, సరిత, కవిత, వెంకటమ్మ పాల్గొన్నారు.

కార్మికులకు లేబర్ కార్డులు పంపిణీ

దౌల్తాబాద్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): భవన నిర్మాణ రంగంలో పని చేసే కార్మికులు తప్పనిసరిగా లేబర్ కార్డును పొందాలని అంకిత స్వచ్ఛంద సంస్థ జిల్లా కో ఆర్డినేటర్ ప్రకాశ్‌కుమార్ అన్నారు. బుధవారం మండలంలోని చెల్లాపూర్ గ్రామంలో కార్మికులకు లేబర్ కార్డులు ను పంపిణీ చేశారు.

మాజీ సర్పంచ్‌ల ముందస్తు అరెస్ట్

దోమ, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ సమావేశాలు కొనసాగుతుండటంతో మాజీ సర్పంచ్‌లను బుధవారం పోలీసులు హౌస్ అరెస్టు చేశారు. పెండింగ్ బిల్లుల కోసం ఐకాస ఇచ్చిన పిలుపుమేరకు చలో అసెంబ్లీకి వెళ్లకుండా పోలీసులు ముందస్తుగా హౌస్ అరెస్టు చేశారు. సర్పంచ్‌ల సంఘం మాజీ మండల అధ్యక్షుడు రాజీరెడ్డి, తదితరులు ఉన్నారు.

సంక్షిప్తంగా..

విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు పంపిణీ

కొడంగల్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): పదో తరగతిలో మంచి మార్కులు సాధించాలని తహసీల్దార్ విజయ్‌కుమార్ అన్నారు. బుధవారం పాత కొడంగల్ గిరిజన గురుకుల పాఠశాలలో విద్యార్థులకు పరీక్ష ప్యాడ్‌లు అందించారు. అనంతరం పాఠశాలలో భోజనాన్ని పరిశీలించారు. ప్రిన్సిపాల్ శ్రీనివాస్ ఉన్నారు.

ఏకాగ్రతతో చదవాలి

కులకచర్ల: మండల కేంద్రంలోని కేజీబీవీలో పదో తరగతి విద్యార్థులకు బుధవారం గిరిజన విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు రాథోడ్ శ్రీనివాస్‌నాయక్ ఎంఈవో హబీబ్ అహ్మద్‌తో కలిసి పరీక్షా ప్యాడ్‌లు పంపిణీ చేశారు. ఏకాగ్రతతో చదివి మంచి మార్కులు సాధించాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ దేవి, జీవీఎస్ మండల ప్రధాన కార్యదర్శి గణేశ్ పాల్గొన్నారు.

చిన్నారుల పట్ల నిర్లక్ష్యంగా ఉండొద్దు

బషీరాబాద్: అంగన్‌వాడీలు చిన్నారుల పట్ల నిర్లక్షంగా ఉండొద్దని బషీరాబాద్ తహసీల్దార్ వైజవెంకటేశ్ అన్నారు. బుధవారం బషీరాబాద్‌లోని అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేశారు. కేంద్రంలోని సరకులను పరిశీలించి పిల్లలకు పౌష్టికకాహారం అందించాలని సూచించారు.

ఆర్థికసాయం అందజేత

యాలాల: మండల పరిధిలోని సంగెం గ్రామానికి చెందిన తొమ్మిది నెలల బాలుడు వశిష్ట అరుదైన కాలేయ వ్యాధితో బాధపడుతున్నాడు. బుధవారం పీఆర్టీయూటీఎస్ ప్రతినిధులు రూ.12 వేలు ఆర్థికసాయం అందజేశారు. బాలుడి చికిత్స కోసం రూ.22లక్షలు అవసరం అవుతుంది వైద్యులు తెలిపారు. దీంతో ఆపన్నహస్తం కోసం బాలుడి తల్లిదండ్రులు ఎదురు చూస్తున్నారు. కార్యక్రమంలో పీఆర్టీయూటీఎస్ మండల అధ్యక్షుడు కృష్ణారెడ్డి, ప్రధాన కార్యదర్శి రాములు పాల్గొన్నారు.

నిర్భయంగా పరీక్షలు రాయాలి

మేడ్చల్ టౌన్: విద్యార్థులు వార్షిక పరీక్షలకు సిద్ధం కావాలని డబీల్‌పూర్ మాజీ సర్పంచ్ వీర్ల పల్లి రాజమల్లారెడ్డి అన్నారు. బుధవారం గ్రామంలోని జెడీపహెచ్‌ఎస్ పాఠశాల వార్షికోత్సవానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక కా ర్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఏపీసీ చైర్మన్ మీన, పాఠశాల ప్రధానోపాధ్యాయులు వేణుమాధవ్ పాల్గొన్నారు.

ఘనంగా పాఠశాలల వార్షికోత్సవాలు

మేడ్చల్ టౌన్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని గౌడవెల్లి జెడ్పీ ఉన్నత పాఠశాల వార్షికోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు సింగిరెడ్డి హరివర్ధన్‌రెడ్డి, నాయకులు సాయిపేట శ్రీనివాస్ యాదవ్, సురేందర్ ముదిరాజ్ పాల్గొన్నారు.

చిన్నారులకు అన్నప్రాసన

కులకచర్ల: మండలంలోని కామునిపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం చిన్నారులకు పలు రకాల వంటకాలతో అన్నప్రసన చేశారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ మండల సూపర్‌వైజర్ యాదమ్మ, టీచర్ పండరి బాయి, కార్యదర్శి శైలజ, హెచ్‌ఎం చంద్రయ్య, మహిళలు పాల్గొన్నారు.

కాంగ్రెస్ గ్రామ కమిటీల ఎన్నిక

ధారూరు: మండల పరిధిలోని మోమిన్‌కలాన్, మోమిన్‌కుర్ధ గ్రామాల్లో బుధవారం కాంగ్రెస్ గ్రామ కమిటీలను ఎన్నుకున్నారు. మోమిన్‌కలాన్ గ్రామ కమిటీ అధ్యక్షుడిగా అలంపల్లి రవి, ఉపాధ్యక్షుడిగా షఫీ, మోమిన్ కుర్ధ గ్రామ కమిటీ అధ్యక్షుడిగా పామిని శ్రీనివాస్, ఉపాధ్యక్షుడిగా జీవన్, కార్యదర్శిగా వీరేందర్ రెడ్డిని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు మాన్ సింగ్, మార్కెట్ కమిటీ చైర్మన్ విజయభాస్కర్ రెడ్డి, వైస్ చెర్మన్ అశోక్ ముదిరాజ్, మాజీ జడ్పీటీసీ రాములు, నాయకులు రమేశ్ కృష్ణ, గఫార్, అవినాష్‌రెడ్డి, బాలకృష్ణ, యాదగిరి, కొండయ్య పాల్గొన్నారు.

తహసీల్దార్‌పై చర్యలు తీసుకోవాలి

పెద్దేముల్, మార్చి 19(ఆంధ్రజ్యోతి): పెద్దేముల్ తహసీల్దారుపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కేవీపీఎస్ జిల్లా ప్రధానకార్యదర్శి ఉప్పలి మల్కయ్య డిమాండ్ చేశారు. ఇందూరు గ్రామంలో కొందరు దళితులకు వారి పెద్దలపై ఉన్న భూములను విరాసత్ చేయడం లేదని ఆరోపించారు. తహసీల్దార్ కార్యాలయం ఎదుట బాధితులతో కలిసి నిరసన వ్యక్తం చేశారు.

పరిగి ఆర్టీసీ డీఎంగా సుఖేందర్‌రెడ్డి

పరిగి: ఆర్టీసీ పరిగి డిపో మేనేజర్‌గా సుఖేందర్‌రెడ్డి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేసిన కరుణశ్రీ బదిలీపై కామారెడ్డి డిపోకు వెళ్లారు. సిద్దిపేట్ డీఎంగా పని చేస్తున్న సుఖేందర్‌రెడ్డి బదిలీపై పరిగికి వచ్చారు.

క్రైం కార్నర్

నల్సార్ ప్రొఫెసర్ పీఎస్ రావు మృతి



శామీర్‌పేట, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): శామీర్‌పేటలోని నల్సార్ యూనివర్సిటీలో అనుబంధ ప్రొఫెసర్‌గా పని చేస్తున్న డాక్టర్ పెమ్మరాజు శ్రీనివాసరావు(పీఎస్ రావు) సోమవారం సాయంత్రం హైదరాబాద్‌లోని ఆయన స్వగృహంలో కన్నుమూశారు. వృద్ధాప్యం కారణంగా అనారోగ్యంతో బాధపడుతూ ఆయన మృతి చెందారు. ఆయన నాలుగేళ్లుగా నల్సార్ యూనివర్సిటీలో అనుబంధ ప్రొఫెసర్‌గా, విశిష్ట అంతర్జాతీయ న్యాయ నిపుణుడిగా, ఇంటర్నేషనల్ ట్రేడ్ అండ్ బిజినెస్ లాస్ సెంటర్ డైరెక్టర్‌గా పని చేస్తున్నారు. నల్సార్ వైస్ ఛాన్సలర్ క్రిష్ణదేవరావు, అధ్యాపకులు, ఆయన నివాసానికి వెళ్లి, ఆయన భౌతిక కాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. అంతర్జాతీయ చట్టానికి ఆయన చేసిన సేవలను పురస్కరించుకుని పీఎస్ రావు మెమోరియల్ వార్షిక అంతర్జాతీయ న్యాయ ఉపన్యాసాలను నిర్వహిస్తుందని, ఆయన వారసత్వం రాబోయే తరాలకు స్ఫూర్తినిస్తుందని క్రిష్ణదేవరావు అన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

కులకచర్ల, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇప్పాయిపల్లిలో బుధవారం టాస్క్‌ఫోర్స్ పోలీసులు రేషన్ బియ్యాన్ని పట్టుకున్నారు. వికారాబాద్ టాస్క్‌ఫోర్స్ సిబ్బంది, స్థానిక పోలీసులు ఇప్పాయిపల్లిలో సంగయ్య కిరాణా దుకాణంలో తనిఖీలు నిర్వహించారు. దుకాణం వెనక గదిలో అక్రమంగా నిల్వ ఉంచిన ఆరు క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకొని నిందితుడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై అన్వేష్‌రెడ్డి తెలిపారు.

యాలాలలో..

యాలాల: అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని పోలీసులు పట్టుకున్నారు. యాలాల ఎస్ఐ గిరి తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని ఇందిరమ్మ కాలనీకి చెందిన జర్పుల మహేష్ చంద్ర రేషన్ లబ్ధిదారుల నుంచి రేషన్ బియ్యాన్ని కొనుగోలు చేశాడు. ఆ బియ్యాన్ని అధిక ధరకు విక్రయించేందుకు బుధవారం వ్యాన్‌లో తరలిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. వాహనాన్ని తనిఖీ చేయగా 60బ స్తాల్లో రేషన్ బియ్యం ఉన్నాయి. ఈ బియ్యాన్ని సీజ్ చేసి తాండూరులోని ఎంఎల్ఎస్ పాయింట్‌కు, వాహనాన్ని యాలాల పోలీసు స్టేషన్‌కు తరలించారు. బియ్యం తరలిస్తున్న మహేష్ చంద్ర, మురళి కృష్ణ, షేక్ అనిఫ్‌పై కేసు నమోదు చేశారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్

దోమ, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు. టాస్క్‌ఫోర్స్ సీఐ అన్వర్‌పాషా తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని దాదాపూర్ నుంచి ట్రాక్టర్‌లో ఇసుకను తరలిస్తుంగా టాస్క్‌ఫోర్స్ సిబ్బందితో కలిసి సీఐ అన్వేష్ రెడ్డి పట్టుకున్నారు. ట్రాక్టర్‌ను సీజ్ చేసి పీఎస్‌కు తరలించారు.

ప్రమాదవశాత్తు బైకులు దగ్ధం

కోట్‌పల్లి, మార్చి19 (ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు రెండు బైకులు దగ్ధమైన ఘటన మండల పరిధిలోని మోత్కుపల్లి గ్రామంలో బుధవారం చోటుచేసుకుంది. బావాజీ విఠల్‌రెడ్డి, పులుమద్ది నర్సింహులుకు చెందిన రెండు బైకులు పొలం వద్ద పెట్టి మరో చోట వ్యవసాయ పనులు చేస్తున్న క్రమంలో ప్రమాదవశాత్తు నిప్పంటుకొని పూర్తిగా కాలిపోయాయి.

చుక్కల జింక మృతదేహం లభ్యం

ధారూరు, మార్చి19(ఆంధ్రజ్యోతి): వాగులో కుళ్లిన స్థితిలో ఉన్న చుక్కల జింక మృతదేహాన్ని బుధవారం అటవీ సిబ్బంది స్వాధీనం చేసుకున్నారు. ధారూరు అటవీ రేంజ్ రేంజర్ రాజేందర్ తెలిపిన ప్రకారం.. మండల పరిధిలోని గట్టేపల్లి, నాగమందర్ గ్రామాల మధ్య వాగు నీటిలో దిగిన చుక్కల జింక బురదలో దిగబడిపోయి ఊపిరాడక మృతి చెందింది. వాగులో చేపల వేటకు వెళ్లిన పెద్దేముల్ మండలం మారేపల్లి తండాకు చెందిన శ్రీనివాస్ అటవీ అధికారులకు సమాచారం ఇచ్చారు. దీంతో రేంజర్ సిబ్బందితో వెళ్లి జింక మృతదేహన్ని బయటకు తీయించారు. నాలుగు రోజుల క్రితం మృతి చెంది ఉండవచ్చని భావిస్తున్నారు.

మహిళ ఆత్మహత్యాయత్నం

ఘట్‌కేసర్ రూరల్, మార్చి 19(ఆంధ్రజ్యోతి): సంస్కృతి టౌన్‌షిప్ ప్లాట్ ఓనర్స్ అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు వేధింపులకు పాల్పడటంతో మనస్థాపానికి గురైన ఓ మహిళా మంగళవారం అర్ధరాత్రి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పోచారం మున్సిపాలిటీ, సంస్కృతిటౌన్‌షిప్‌లో ఎ20లోని 102లో అద్దెకుంటున్న బండారు రవిశంకర్ తన భార్యతో కలిసి ఉమారాణి టౌన్‌షిప్‌లో హోటల్ నిర్వహిస్తున్నాడు. ఇటీవల సంస్కృతి టౌన్‌షిప్ ప్లాట్ ఓనర్స్ అసోసియేషన్ ఉమారాణికి హోటల్ విషయమై వివాదం నెలకొనగా ఉపాధ్యక్షుడు సత్యనారాయణ ఆమెపై దాడిచేశాడు. దీంతో ఆమె పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కార్యవర్గ సభ్యులపై కేసు నమోదు చేయడంతో పాటు ఫిర్యాదు చేసిన ఉమారాణిపై సైతం పోలీసులు ఫిర్యాదు చేశారు. రెండుమూడు రోజులుగా అసోసియేషన్ సభ్యులు వాట్సాప్ గ్రూపు ల్లో అసభ్యకరంగా పోస్టులు చేస్తున్నారని మనస్థాపానికి గురైన ఉమారాణి గుర్తుతెలియని మాత్రలు మింగి భర్తకు వీడియో కాల్ చేసింది. ఇంటికి చేరుకున్న భర్త ఉమారాణిని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఆస్పత్రికి చేరుకొని వివరాలు తెలు సుకున్నారు. ఉమారాణి ఆరోగ్యపరిస్థితి నిలకడగ ఉన్నట్లు వైద్యులు తెలిపారు. బాధితుల ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేస్తున్నారు.

బీటెక్ విద్యార్థిని అదృశ్యం

ఘట్‌కేసర్ రూరల్, మార్చి19(ఆంధ్రజ్యోతి): బీటెక్ మొదటి సంవత్సరం చదువుతున్న ఓ విద్యార్థిని అదృశ్యమైన ఘటన పోచారం ఐటీ కారిడార్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ రాజువర్మ తెలిపిన వివరాల ప్రకారం.. నెల్లూరుకు చెందిన మురళి తన భార్య, ఇద్దరు పిల్లలతో కలిసి పోచారం మున్సిపాలిటీ అన్నోజిగూడలోని సాయినగర్ కాలనీలో నివాసం ఉంటున్నాడు. తన రెండో కూతురు దీపిక(20) చైతన్య డీమ్డ్ యూనివర్సిటీలో బీటెక్ మొదటి సంవత్సరం చదువుతుంది. రెండు నెలల నుంచి దీపిక ఫోన్ ఎక్కువగా మాట్లాడుతుందని కాలేజ్‌కు పంపడం లేదు. ఈ నెల 17న దీపికకు కిడ్నీలో రాళ్లు వచ్చాయని చికిత్స నిమిత్తం నెల్లూరుకు వెళ్లి తిరిగి వచ్చారు. 18న మధ్యాహ్నం తల్లి నిద్రపోగానే దీపిక ఇంట్లో నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. దీంతో తల్లిదండ్రులు ఎంత వెతికినా ఫలితం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. కాలేజ్ బస్సు డ్రైవర్ శ్రీను తన కూతురుతో ఎక్కువగా ఫోన్‌లో మాట్లాడేదని, అతడిపై అనుమానం ఉందని పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

పేదలకు మెరుగైన వైద్యం అందించాలి

అదనపు కలెక్టర్ సుధీర్

తాండూరు రూరల్, మార్చి 19(ఆంధ్రజ్యోతి): పేదలకు మెరుగైన వైద్యం అందించాలని అదనపు కలెక్టర్ సుధీర్ అన్నారు. తాండూరు మండలం జిన్‌గుర్తి ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆస్పత్రిలోని ఇన్‌పేషంట్, లాబొరేటరీ, మందుల నిల్వగదితో పాటు రిజిస్టర్లను పరిశీలించారు. భవన పరిసరాలను పరిశీలించి ఆసుపత్రి మరమ్మతు పనులను పూర్తిచేయాలని అధికారులకు సూచించారు. అనంతరం బీసీ బాలుర వసతిగృహాన్ని తనిఖీ చేశారు. కార్యక్రమంలో హాస్టల్ వార్డన్ శ్రీశైలం, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.